విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి రోజు గురువారం పాఠశాలల ప్రారంభంలో భాగంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ ఎం ప్రతాప్‌రెడ్డి, ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

12మందికి టీబీ నిర్ధారణ

అడ్డగుట్ట: టీబీ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని టీబీ అలర్ట్ ఇండియా వైద్య సిబ్బంది సూచించారు. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మొండిబండ నగర్‌లో టీబీ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలోని 90 మందికి పరీక్ష చేయగా 12 మందికి క్షయవ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సీవీఎస్. రాజు తెలిపారు. టీబీ యూనిట్ సిబ్బంది సుబ్బారావు, శబూంతి, సంజీవని, ఏఎన్‌ఎం కుమారి, ఆశా వర్కర్ స్వరూప పాల్గొన్నారు.

అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ను కలిసిన కోట నీలిమ

సనత్‌నగర్: టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, తనకు ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోనే సంస్కారం

సనత్‌నగర్: చదువుకుంటేనే సంస్కారం అలవడుతుందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సనత్‌నగర్ తెలుగు మీడియం, ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆమె పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్య ప్రతిఒక్కరికీ తప్పనిసరి అన్నారు. మండల విద్యాధికారి హరిచంద్ర, ఏపీసీసీ చైర్మన్లు వసంత, అమరావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మార్త, సునీ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ జిల్లా కలెక్టర్‌ను కోరారు. గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన ఆమె వినతిపత్రం అందించారు. వారాసీగూడ లక్కీ హోటల్ పక్కన, నామాల గుండు జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం పక్కన, మార్కండేయనగర్, చిలకలగూడ వడ్డెరబస్తీ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు బోర్డులు ఏర్పాటు చేసి దురాక్రమణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

బోయిగూడ ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్షలు



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో గురువారం టీబీ పరీక్షలు నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద వైద్య సిబ్బంది సై-టీబీ పరీక్షలు నిర్వహించారు. క్షయవ్యాధి ప్రమాదం ఎక్కువగా మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసే వారికి పెద్ద ఎత్తున ఈ పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి డాక్టర్ జి. అనిల్ కుమార్ చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన..

సనత్‌నగర్: ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భ నీటి మట్టాన్ని పెంచడం ద్వారా నీటి సమస్య తలెత్తకుండా చూడవచ్చంటూ గురువారం జలమండలి అధికారులు సనత్‌నగర్ మోడల్‌కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు రెయిన్‌వాటర్ సెల్ ఓఎస్‌డీ జల సత్యనారాయణ, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి హాజరయ్యారు.

లక్ష్యం.. పచ్చదనం

వన మహోత్సవానికి సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం.. ● బేగంపేట సర్కిల్‌లో ఏర్పాట్లు..



నర్సరీల్లో సిద్ధంగా ఉంచిన మొక్కలు..

సనత్‌నగర్: వన మహోత్సవానికి అధికారులు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వరుసగా రెండోసారి ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఆ మేరకు అధికార యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బోనాల జాతర ప్రారంభంతోనే మొక్కలు నాటే మహత్తర యజ్ఞం ఆరంభం కానుంది. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బేగంపేట సర్కిల్‌లో ఈ సంవత్సరం కూడా 50 వేల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ మేరకు సర్కిల్ పరిధిలోని బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్ల వ్యాప్తంగా ఎక్కడెక్కడ మొక్కలు నాటాలనే దానిపై ఇప్పటికే అధికారులు అంచనాకు వచ్చారు. ముఖ్యంగా బేగంపేట సర్కిల్‌లో ఖాళీ స్థలాలంటూ లేవు. అయితే ప్రస్తుతం ఉన్న పార్కుల్లో వాటి ప్రహరీగోడలను ఆనుకుని చిన్న చిన్న మొక్కలను నాటాలని నిర్ణయించారు. అలాగే సర్కిల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల ప్రాంగణాలపై దృష్టిసారించి అక్కడ మరింత పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికి తోడు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పలుచోట్ల ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమవుతుండగా ఆయా చోట్ల కూడా మొక్కలు నాటేందుకు సమాయత్తమవుతున్నారు. మెక్లెన్‌గూడ, చుట్టలబస్తీ, పీజీ కళాశాల, వెస్లీ కాలేజ్, బన్సీలాల్‌పేట డి-క్లాస్, హమాలీబస్తీ..ఇలా గుర్తించిన ప్రాంతాల్లో మొక్కలు విరివిగా నాటనున్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం..

బేగంపేట సర్కిల్‌లో మొక్కలు నాటేందుకు ఇప్పటికే పలు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశారు. అల్లనేరేడు, వేప, కానుగ, రావి, మర్రి, ఫైకస్, నెమలినార, చిన్నబాదం, గుల్‌మొహర్, తబూబియా రోజీ, స్పాటిడియా, మహాగని కొడంబ తదితర విభిన్న రకాలు, విభిన్న జాతులకు చెందిన పూలు, పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచారు. పెద్ద చెట్లతో పాటు చిన్న చిన్న మొక్కలు ఆయా నర్సరీల్లో కొలువుదీరాయి.

బతికించడమే ప్రధానంగా..

బేగంపేట సర్కిల్‌లో 50,000 మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అయితే నాటిన మొక్కలను బతికించాలన్నదే ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నారు. గతంలో ఇబ్బడిముబ్బడిగా మొక్కలు నాటినా అవి ఏమేర బతికాయో కూడా తెలియని పరిస్థితులు. మొక్కలు నాటాలంటే ముఖ్యంగా ఖాళీ స్థలాలు లేకపోవడం, వాటికి ఫెన్సింగ్‌లు ఏర్పాటుచేయడం కష్టతరంగా కూడుకున్నది కావడం, నీరు పోసేందుకు ట్యాంకర్లను సమకూర్చడం వంటివి భారంగా పరిణమించడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి కనబరచడం లేదు. ఈ యేడు కూడా అదే పరిస్థితి నెలకొనడంతో యూబీడీ విభాగానికి చెందిన వారే స్థానికంగా ఉన్న పలు సంక్షేమ సంఘాలతో కలిసి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలనే బలమైన సంకల్పం పెట్టుకున్నారు. అయితే లక్ష్యాన్ని చేరువ చేసే దిశగా నాటిన మొక్కలను కాపాడుకోవాలనే దాని పైనే ప్రధానంగా దృష్టిసారించారు. ఐదారు వేల వరకు పెద్ద మొక్కలు, 30 వేల వరకు చిన్న మొక్కలను పార్కులతో పాటు నిర్దేశించిన ప్రాంతాల్లో నాటే యోచనలో ఉన్నారు. మరో 115 వేల వరకు నివాసితులకు పంపిణీ చేసి ఎలాగైనా 50 వేల టార్గెట్‌ను చేరుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

వన మహోత్సవంలో ప్రతిఒక్కరినీ భాగస్వామ్యం చేసేలా చూస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలతో పాటు యువజన, ఇతరత్రా సంఘాల ప్రతినిధులను ఇందులో పాల్గొనేలా చూడడంతో పాటు మొక్కల పరిరక్షణ చూసుకునేలా కోరుతాం. నాటిన మొక్కలను వాటిని కాపాడుకోవాలన్నదే ముఖ్యంగా ముందుకుసాగుతున్నాం. ఇందుకు యూబీడీ అధికారులకు సహకారం అందించాలి. బేగంపేట సర్కిల్‌లో 50 వేల వరకు మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఆ మేరకు నర్సరీల్లో చిన్న, పెద్దా మొక్కలను సిద్ధంగా ఉంచాం.

– గణేష్, మేనేజర్, యూబీడీ విభాగం, బేగంపేట సర్కిల్

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు



రైతు సదస్సును ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు

లాలాపేట: రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వ్యవసాయ శాఖ కార్యదర్శి అధికారి రఘునందన్ రావు అన్నారు. ఈ వానా కాల సీజన్‌లో రైతులందరికీ రైతు భరోసా అందేలా యాక్షన్ ప్లాన్ తయారు చేసి దాన్ని అమలు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎస్ఐఆర్-ఐఐసిటీ లాంటి జాతీయ పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేస్తున్న టెక్నాలజీని వ్యవసాయ రంగంలో బదిలీ చేయడం ద్వారా మరిన్ని మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం పలు పరిశోధన సంస్థలతో వ్యవసాయ రంగానికి టెక్నాలజీని అందించేందుకు పరస్పర ఒప్పందాలు(ఎంఓయూ) చేసుకున్నారు. ఐఐసిటీ డైరెక్టర్ డా. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా అంబేడ్కర్ కూడలి



సీతాఫల్‌మండి కూడలిలో ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి అంబేడ్కర్ కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ చెప్పారు. గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సీతాఫల్‌మండి కూడలిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడలిని విస్తరించడంతోపాటు డాక్టర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాలను ప్రతిష్టించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం కీసర ప్రాంతంలో ఇద్దరు మహనీయుల విగ్రహాలు తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సువర్ణ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ కేంద్రం సందర్శన

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సందర్శించారు. సెట్విన్ కేంద్రంలో అదనపు గదుల నిర్మాణం కోసం చేపట్టిన మరో రెండు అంతస్తుల భవన నిర్మాణం పనులు తుదిదశకు చేరాయి. ఈ సందర్భంగా ఇక్కడి అభివృద్ధి పనులను సందర్శించిన అనంతరం శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వృత్తి విద్యా కోర్సులు, ఉపాధి అవకాశాల గురించి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తనతో కేంద్రాన్ని సందర్శించిన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు వివరించారు.

కమ్యూనిటీ హాల్ వేలం వేయొద్దు: తలసాని



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు..

సనత్‌నగర్: ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో అమీర్‌పేట డివిజన్ ఎస్సార్ నగర్‌లో గల పలు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. స్థానికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సార్ నగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను వేలం ద్వారా విక్రయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందని, దానిని అడ్డుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.13 కోట్లు వెచ్చించి 2,606 గజాల విస్తీర్ణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫంక్షన్ హాల్, డైనింగ్ హాల్, పార్కింగ్, షాపులతో కూడిన కమ్యూనిటీ హాల్ నిర్మించిందని వివరించారు. ఇందులో దాదాపు 80 శాతం మేర పనులు జరిగాయని, మిగిలినవాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, విక్రయించాలని చూడటం దుర్మార్గమని అన్నారు. ఎస్సార్‌నగర్ కమ్యూనిటీ హాల్ వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సార్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, బి-టైప్ అధ్యక్షుడు రాజేష్, గౌతమ్‌రెడ్డి, వివేక్‌నాథ్, పెంటయ్య, కృష్ణకాంత్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువే



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజావాణి స్పెషల్ ఆఫీసర్ సూర్యప్రకాశ్

చిలకలగూడ: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువునే ఆస్తిగా ఇవ్వాలని అప్పుడే సమాజం అన్నివిధాల అభివృద్ధి చెందుతుందని ప్రజావాణి స్పెషల్ ఆఫీసర్ సూర్యప్రకాశ్ ఉద్బోధించారు. చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన మెగా బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బడిబాట కార్యక్రమంలో సుమారు 50కి పైగా పిల్లలను స్కూలులో చేర్పించి జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన దూద్‌బావి పాఠశాల నిర్వాహకులను అభినందించారు. పాఠశాల ప్రాంగణంలో క్రీడాపరికరాలను సమకూర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. నిరుపేద విద్యార్థులకు మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మదన్‌మోహన్‌రెడ్డి హామి ఇచ్చారు. అనంతరం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అపెక్ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, కార్యదర్శి రేణుక, పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరెడ్డి, ఉపాధ్యాయులు ఆయేషాబేగం, మల్లిశ్వరీ, హసినాబేగం, సలేహా, సహీనసుల్తానా, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లోని కురుమ కమ్యూనిటీకి సంబంధించిన శ్మశానవాటిక ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్‌ను ఆదేశాలు జారీ చేశారు. చాచానెహ్రూనగర్‌లోని కురుమ కమ్యూనిటీకి సంబంధించిన శ్మశానవాటిక అక్రమణకు గురై భవన నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే దీన్ని పరిరక్షించాలని కోరుతూ కురుమ సంఘం ప్రతినిధులు సికింద్రాబాద్ ఆర్డీఓ, జీహెచ్‌ఎంసీ, హైడ్రాకు అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. తమ కమ్యూనిటీ శ్మశానవాటిక కబ్జాకు గురైందని పేర్కొంటూ పలు ఆధారాలతో సంఘం నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. సదరు శ్మశానవాటికి స్థలం పవిత్రతను కాపాడాలని..పరిరక్షించాలని ఆర్డీఓ సికింద్రాబాద్ తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గాంధీనగర్ పోలీసుల సహకారంతో సదరు స్థలాన్ని కాపాడాలని కోరుతూ జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. జీఆర్పీ ఎస్‌ఐ బి.రమేశ్ తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రం మంజూరా లాగ్మాకు చెందిన అమిత్‌కుమార్ (35), రోహిత్‌కుమార్ వరుసకు సోదరులు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన వీరిరువురు మల్లాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. ఈనెల 11న వీరిరువురు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. జనరల్ టికెట్ తీసుకున్న అమిత్‌కుమార్‌ను ఊరికి వెళ్లడం కోసం హౌరా ట్రైన్ ఎక్కించి వీడ్కోలు పలికిన రోహిత్‌కుమార్ మల్లాపూర్ వెళ్లిపోయాడు. ఆ తరువాత కొద్ది సేపటికి అమిత్‌కుమార్ సెల్‌ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ అయింది. మరుసటి రోజు అతడు సొంత ఊరుకు చేరలేదు. గురువారం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఆశ్రయించిన రోహిత్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసే నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: ఫాదర్ బాలయ్యనగర్, రిట్రీట్ కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సికింద్రాబాద్ మురళి కృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 నుండి 12.30 గంటల వరకు ఫాదర్ బాలయ్య నగర్, భవానినగర్, సిటిజన్ కాలనీ, అయ్యప్ప నగర్, అంబేద్కర్‌నగర్‌లలో..అలాగే మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు రిట్రీట్ కాలనీ, భవాని నగర్, వీబీఆర్ గార్డేన్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్, ఈఎస్‌ఐ, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్యామలకుంటపార్కు, బీకేగూడ మున్సిపల్ పార్కు, ఈఎస్‌ఐ వెనుక ప్రాంతం, వెంకట్ ప్లాజా, ఒబ్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, పోచమ్మ బస్తీ, పంజగుట్ట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీకేగూడ, జెక్‌కాలనీ, శివాజీ నగర్, ఎల్‌ఐజీ, ఉదయ్‌నగర్ కాలనీ, హనుమాన్ టెంపుల్, శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్, కుందన్‌బాగ్ ఏరియా, శ్రీనివాస టవర్స్, అమోఘ ప్లాజా, మేటాస్, బ్లూ మూన్ హోటల్, మనీల్యాండ్ చైనా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

చిలకలగూడ: వారాసిగూడ ఫీడర్ సీతాఫల్‌మండి సెక్షన్ పరిధిలోని ఎస్‌బీఐ లైన్, గుడ్‌విల్ హోటల్‌లైన్, జాన్సన్‌గ్రామర్‌స్కూలు ఏరియా, టీఆర్‌టీ క్వార్టర్స్, రామాలయం టెంపుల్ ఏరియా, శివాజీ స్టాట్యూ, వారాసిగూడ క్రాస్‌రోడ్, మీనా కేఫ్‌లైన్, వారాసిగూడ రోడ్ నంబర్ 1 నుంచి 5 వరకు, ఇందిరానగర్ రోడ్ నంబర్ 1 నుంచి 5 వరకు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ మహేష్‌కుమార్, ఏఈ శ్రీకాంత్ తెలిపారు. మేడిబావి ఫీడర్ పరిధిలోని మేడిబావి ఏరియా, మేడిబావి ఆర్యసమాజ్, బూత్‌బంగ్లా ఏరియా, అచ్చిరెడ్డి లైన్, భారత్ యువజన సంఘం ఏరియాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు పరిధిలో బోర్డు నిధులు రూ.45లక్షలతో చేపట్టే తాగునీటి పైపులైను పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లిఖార్జున్‌తో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ డిఐ మెయిన్ ఫీడర్ పైప్‌లైన్ ఏర్పాటు వల్ల పలు ప్రాంతాల్లో తాగునీటి కొరత తీరుతుందని చెప్పారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల స్వంత ఇంటి కలను నెరవేర్చడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మడ్‌ఫోర్ట్ ఉత్తరయ్య గుడిసెల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించి గుడిసెవాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని తిరుమలగిరి మండల రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంబిస్తారన్నారు. రెండు మూడు రోజుల్లో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారుల లక్కీడ్రా నిర్వహించి ఇండ్ల కేటాయింపు కార్యక్రమం చేపడతామని చెప్పారు.

55 ఏళ్ల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

సనత్‌నగర్: కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్‌లో మధ్య ప్రదేశ్‌కు చెందిన 55 ఏళ్ల మహిళకు అరుదైన స్పైన్ క్యాన్సర్ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. వెన్నెముకలో క్యాన్సర్ కారణంగా నరాలపై ఒత్తిడితో కాలు పెరాలసిస్ స్టేజికి వెళ్లి నడవలేని స్థితిలో ఉన్న మహిళకు కిమ్స్ సన్‌షైన్ సర్జన్ డాక్టర్ హిమాన్షు ప్రసాద్ నేతృత్వంలో శస్త్ర చికిత్స నిర్వహించి క్యాన్సర్ కణితిని పూర్తిగా తొలగించి రోగిని తిరిగి నడిచే స్థితిలో తీసుకువచ్చారు. ఈ శస్త్ర చికిత్సకు సంబంధించి స్పైన్ సర్జన్ డాక్టర్ హిమాన్షు ప్రసాద్ వివరాలను వెల్లడించారు.

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం



అడ్డగుట్ట: విద్యను అభ్యసించడంతో పాటు క్రమశిక్షణ కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా తుకారంగేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫారాలు పంపిణీ చేశారు. అనంతరం, మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనతో పాటు వసతులను మెరుగుపరుస్తున్నామని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్ రాజ్ పాల్గొన్నారు.

మోగిన బడి గంట..


- తొలి రోజు యూనిఫాం, పుస్తకాల పంపిణీ..
- పలుచోట్ల విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమాలు..



బడిబాట పట్టిన ప్రభుత్వ పాఠశాల చిన్నారులు..

సనత్‌నగర్: బడి గంట మోగింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు 45 రోజులకు పైగా ఆటపాటలతో సరదాగా గడిపిన చిన్నారులు గురువారం బడిబాట పట్టారు. తొలి రోజు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీతో పలు పాఠశాలల ఉపాధ్యాయులు బిజీగా గడిపారు. మరికొన్ని పాఠశాలల్లో తొలి రోజు స్కూల్‌కు వచ్చిన విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు బడి బాట ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లందరినీ పాఠశాలల్లో చేర్పించండి అంటూ చిన్నారుల నినాదాలతో సనత్‌నగర్ వీధులు హోరెత్తాయి. ప్రభుత్వ పాఠశాల సనత్‌నగర్ ఓల్డ్ విద్యార్థులు విద్యార్థులు స్థానికంగా పలు బస్తీలు, కాలనీల్లో బడిబాట ర్యాలీలు కొనసాగించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యా బోధన, ఉచిత నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ, ఉచిత మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, శారీరిక వ్యాయామం, క్రీడలు, యోగ బోధన, ఏఐ ద్వారా కంప్యూటర్ బోధన వంటి ప్రత్యేకతను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇంకొన్ని పాఠశాలల్లో టీచర్స్-పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటుచేసి పాఠశాలలో ఉన్న వసతులు, కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు.

బన్సీలాల్‌పేట్: బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, న్యూబోయిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సున్నంబట్టీ, జీరా హైదర్‌బస్తీలోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మారక పాఠశాల, ఓల్డ్ బోయిగూడలోని ఆదయ్యనగర్ ప్రభుత్వ పాఠశాల, మోండా మార్కెట్ ప్రభుత్వ పాఠశాల, న్యూబోయిగూడలోని సెయింట్ ఫిలోమినా పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్నమైనరీతిలో స్వాగతం పలికారు.



మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ..

రసూల్‌పురా: బోయిన్‌పల్లి, రసూల్‌పురా, బాలంరాయి, మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలు, బాపూజీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలల గేట్‌లకు తరగతి గదులకు మామిడి తోరణాలు, బంతిపూలు కట్టారు. పాఠశాల ఆరంభ వేడుకలు అంబరాన్నంటాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు విద్యార్థుల తల్లితండ్రులను ఆహ్వానించి వారికి పూలను అందజేశారు. బోయిన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో బోర్డు మాజీ సభ్యులు జంపన ప్రతాప్ పుస్తకాలు, యూనిఫారాలు అందజేశారు.

లాలాపేట: లాలాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐ లవ్ మై స్కూల్ అని ఫోటో ఫ్రేమ్‌ను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. తార్నాక, లాలాపేట ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మొదటి రోజు ఉత్సాహంగా తరగతులు కొనసాగాయి.